క్లుప్తంగా

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం


శంకరరావు

విజయనగరం: పదవ తరగతి దాటిన విద్యార్థులకు దరఖాస్తుతో సంబంధం లేకుండానే కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడం ఒక మంచి ప్రయత్నమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పైకి చిన్న విషయంగా కనబడుతున్నా కుల ధ్రువీకరణ పత్రాలు సంపాదించడానికి ఆయా వర్గాలు, ప్రత్యేకించి పేదలు, ఆదివాసీలు, దళితులు ఎంత కష్టపడాల్సి వస్తుందో చెప్పనలవి కాదన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసి పై చదువు కోసం దరఖాస్తు చేస్తే కులధ్రువీకరణ పత్రం జత చేయడం తప్పనిసరని, అటువంటి కీలకమైన ధ్రువపత్రాలు సులభంగా అందించే నిర్ణయం తీసుకోవటం అభినందనీయమన్నారు. 40 లక్షల కుటుంబాలకు, 10 లక్షల మంది పదవ తరగతి విద్యార్థులకు అడగకుండానే వారి కుల ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచడం, అందించడం గొప్పమేలు చేసే కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ దిశగా ఆలోచించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

రేషన్ పంపిణీ పరిశీలన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

విజయనగరం రూరల్: కార్పొరేషన్ పరిధిలోని కే.ఎల్.పురంలో రేషన్ పంపిణీని కేంద్ర బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. రేషన్ సరుకులు, వాటి నాణ్యత పరిశీలనతో పాటు లబ్ధిదారులతో మాట్లాడారు. సరుకుల పంపిణీ తీరుపై ఆరా తీశారు. వారి వెంట పౌర సరఫరాల శాఖ డీఎం మీనాకుమారి, మండల సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథం ఉన్నారు.

పేద క్షత్రియ కుటుంబాలను ఆదుకుంటాం

భోగాపురం: పేద క్షత్రియ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామని విజయరామ గణపతి క్షత్రియ సేవాసమితి సభ్యులు వెల్లడించారు. మండలంలోని కంచేరు సమీపంలో ఉన్న ఆనందరూపం అతిథి గృహంలో సేవాసమితి ముఖ్య సలహాదారు కాకర్లపూడి శ్రీనివాసరాజు, అధ్యక్షుడు నల్లపురాజు సత్యనారాయణ సేవా సమితి సభ్యులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో పేద క్షత్రియ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామని అన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యంతో పాటు వివాహాలకు ఆర్థికపరమైన సహాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన విజయనగరం జిల్లా సేవా సమితి అధ్యక్షుడు దంతులూరి సింగుబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు దంతులూరి సూర్యనారాయణరాజు, పాకలపాటి రామభద్రరాజు, కాకర్లపూడి నారాయణమూర్తిరాజు, దంతులూరి రావాడబాబు, వాసుదేవ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట: మండలంలో వసి గ్రామంలో మంచినీటి కోనేరు గట్టుపై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు కృష్ణమూర్తి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. వసి, తిమిడి, గ్రామ సర్పంచ్‌లు ఒబ్బిన పార్వతి, త్రినాధమ్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పట్నాయక్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరు, మూవ్‌మెంట్ రిజిష్టరు, ప్రజల వినతులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న వినతులపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి
- ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అభిమానుల కోలాహలం, లబ్ధిదారుల ఆనందం, డప్పు వాయిద్యాలు, ఘనంగా స్వాగతాలు, దుశ్శాలువలతో సత్కారాలు, మంగళ హారతుల నడుమ సందడి వాతావరణంలో నగరంలోని 21వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరిస్తూనే ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీస్సులు అందించాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానికులు విన్నవించిన సమస్యలను వెనువెంటనే పరిష్కరించారు. పారిశుద్ధ్య మెరుగుదలకు చొరవ చూపాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఏదో ఒక పథకాన్ని అందిస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు సహాయకారిగా నిలుస్తోందన్నారు. ఒకటో తేదీ నాటికి పింఛన్లు, ఇంటి వద్దకే రేషన్ సరుకులు, అమ్మ ఒడి, చేయూత, ఆసరా, సున్నా వడ్డీ వంటి అనేక సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే అందిస్తూ అవినీతి రహిత పాలనను సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన పాలనతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమకు అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పోటా పోటీగా అమలు జరుగుతున్నాయని అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రత్యేక కృషితో నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ స్థాయికి ఎదిగిన తర్వాత అదే స్థాయిలో అభివృద్ధిని సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లి, 20వ డివిజన్ కార్పొరేటర్ కంటూభుక్త తవిటిరాజు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, పార్టీ జోనల్ ఇన్‌చార్జి కాళ్ల సూరిబాబు, డివిజన్ ఇన్‌చార్జి కనకల గిరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: భోగాపురంలో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపనకు ఈ నెల 3న విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రజాప్రతినిధులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుతో పాటు చింతపల్లిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన, రామతీర్థసాగర్ రిజర్వాయర్ మిగులు పనుల పూర్తికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం సవరవల్లి వద్ద బహిరంగ సభ జరుగుతుందని దీన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతీ గ్రామం నుంచి ఆ గ్రామంలో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాధ్యతలు తీసుకుని సభ విజయవంతానికి పని చేయాలన్నారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి


మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు

విజయనగరం: ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందించేందుకు కార్యదర్శులు చిత్తశుద్ధితో కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సచివాలయాల కార్యదర్శులతో ఆయన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా ఆయా సచివాలయ కార్యదర్శులకు విధి విధానాలపై స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు. ప్రజలతో మమేకమై, మర్యాదపూర్వకంగా వ్యవహరించి పురసేవలను అందించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శుల దిన చర్యలపై ఆరా తీశారు. హెల్త్ సెక్రటరీలు ఉదయం 5 నుండే తమ విధులను నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. అలాగే ప్రతి విభాగానికి చెందిన కార్యదర్శులు చేపట్టాల్సిన విస్తృత సేవలపై వివరించారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులు 500 అందగా వాటిలో ఎక్కువ శాతం టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్యంపైనే ఉన్నాయన్నారు. పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ఫిర్యాదులను తక్షణమే స్పందించి సకాలంలో పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. అప్పుడే సచివాలయ వ్యవస్థ ఔన్నత్యం వెల్లివిరుస్తుందన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఏసీపీ మధుసూదనరావు, ఈఈ శ్రీనివాసరావు, టీపీఆర్‌వో సింహాచలం, డీఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విజయనగరం శ్రీ శారద సంఘం ప్రతినిధులు సమకూర్చిన అమ్మవారి విగ్రహాన్ని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, సర్పంచ్ పిన్నింటి చిన అప్పలనాయుడు తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు, గ్రామ పెద్దలు కురిమినేని రాజేశ్వరరావు, పాలూరి తిరుపతిరావు, కురిమినేని గురునాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటల సాగుతో లాభాలు


నవధాన్యాల కిట్లు అందచేస్తున్న రైతుసాధికార సంస్థ అధికారి హేమసుందర్

బొండపల్లి: అంతరపంటల సాగుతో అదనపు ఆదాయం లభిస్తుందని రైతుసాధికారిత సంస్థ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని బి.రాజేరు గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాలయ సాగుపై అవగాహన కల్పించారు. అంతర పంటలు, నవధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయ విధానం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. అనంతరం నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజపతినగరం సబ్‌డివిజన్ మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ, మోపాడ రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాల తయారీ కిట్లు పంపిణీ

శృంగవరపుకోట: భారత డైనమిక్స్ లిమిటెడ్ సౌజన్యంతో గ్రామీణ స్త్రీలు నిర్వహిస్తున్న వస్త్ర తయారీలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్సీ రఘురాజు సోమవారం సందర్శించారు. అనంతరం సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ప్రోగ్రాం కింద బీడీఎల్ సమకూర్చిన వస్త్రతయారీ రంగంలో వినియోగించే కిట్లను 30 మందికి స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎంపీడీఓ శేషుబాబు పాల్గొన్నారు.

ఘనంగా పీవీజీ రాజు జయంతి ఉత్సవాలు


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

- నిరుపేదలకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్సీ సురేష్‌బాబు

విజయనగరం: క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో డాక్టర్ పీవీజీ రాజు 99వ జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా పీవీజీ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల మరణించిన దంతులూరి శంకరసీతారామరాజు చిత్రపటం వద్ద పరిషత్ సభ్యులంతా అంజలి ఘటించారు. ఈ సందర్భంగా నిరుపేద క్షత్రియ మహిళలకు, విద్యార్థులకు ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. పీవీజీ రాజు విద్యాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి సీతారామరాజు, జాయింట్ సెక్రటరీ సాగిశివాజీరాజు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అనాధ ఆశ్రమానికి వితరణ

విజయనగరం: దివంగత డాక్టర్ పీవీజీ రాజు 99వ జయంతి సందర్భంగా క్షత్రియ పరిషత్ విజయనగరం ఆధ్వర్యంలో స్థానిక బాబామెట్టలో గల వెలుగు అనాధ ఆశ్రమానికి మంచాలు, వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతి రాజు, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘు వర్మలు వాటిని ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ రాజు ఆశయ సాధనే ధ్యేయంగా క్షత్రియ పరిషత్ సభ్యులు అందరూ కలిసి పని చేయటం ఆనందంగా ఉందన్నారు. వెలుగు అనాధ ఆశ్రమం నిర్వాహకులు ఖలీల్ బాబు మాట్లాడుతూ పీవీజీ జయంతిని ఆశ్రమంలో జరపటం అనాధలకు మనం ఇచ్చే గౌరవంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ కార్యదర్శి సీతారామరాజు, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ రాజు, జాయింట్ సెక్రటరీ సాగి శివాజీ రాజు, యూత్ పరిషత్ కార్యదర్శి కొప్పెర్ల లక్ష్మీపతివర్మ, మహిళా పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు లలిత, సుధారాజు, రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి నాగమణి


సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి నాగమణి

విజయనగరం లీగల్: కార్మికులకు తమ హక్కులపై అవగాహన పెరగాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కె.నాగమణి అన్నారు. స్థానిక కార్మిక శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో కార్మిక దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మికుల్లో న్యాయ అవగాహన పెరిగే విధంగా కార్మిక శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా కార్మిక శాఖలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. దీని వల్ల వారికి ప్రభుత్వ పరంగా రావాల్సిన పరిహారాలు, ప్రోత్సాహకాలు అందే అవకాశం ఉంటుందన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారిని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కె.నాగమణి అభినందించారు. ఉప కమిషనర్ ఎస్.సుబ్రమణ్యం, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎ.ప్రవీణ్ కుమార్, కార్మిక శాఖ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

తెల్లదోమ యాజమాన్యంపై అవగాహన


వీహెచ్ఏ, వీఏఏలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారులు

భోగాపురం: రుగోజ్ సర్పిలాకారి తెల్లదోమ యాజమాన్యంపై జిల్లా ఎంటాలమాలజీ శాస్త్రవేత్త డా.ఎస్.చలపతిరావు, ఏడీఏ కె.శైలజ, హెచ్ఓ జి.జోత్స్న, ఎంఏఓ సూరినాయుడు పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన వీహెచ్ఏ, వీఏఏలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొబ్బరిని ప్రధానంగా నల్ల ముక్కు పురుగు, ఎర్రముక్కు పురుగు ఎక్కువగా ఆశిస్తాయన్నారు. సర్పిలాకారి తెల్లదోమ ఆశించే కొబ్బరి తోటల్లో మొత్తం ఆకులు నల్లగా మారుతాయని, ఇవి ఎక్కువగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఆశిస్తాయన్నారు. దానికంటే ముందు గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. చెట్టుకు ఐదు అడుగుల ఎత్తులో పసుపు జిగురుప్పంలో కట్టినట్లయితే దీని ఉధృతిని తెలుస్తుందని చెప్పారు. 2023 - 24 సంవత్సరంలో ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన విస్తరణ పథకాలు, బిందు సేద్యంపై రాయితీలపై అవగాహన కల్పించారు. రైతులకు ఏమైన సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఘనంగా ఎంవీజీఆర్ కళాశాల వార్షికోత్సవం


విద్యార్థులకు ఎక్స్‌లెన్స్ అవార్డులు అందజేస్తున్న అతిథులు

డెంకాడ: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల 25వ వార్షికోత్సవం ఘనంగా సోమవారం నిర్వహించారు. మానస్ తరంగ్ – 23 పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, విజయనగరం రోటరీక్లబ్, రోటరీ పార్వతీదేవి అంచలియా స్వచ్ఛంద రక్త కేంద్రం సహాయంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు 60 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. డాక్టర్ పీవీజీ రాజు చేసిన సేవల ఫొటోలను గ్యాలరీలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి విజయనగరం గురజాడ జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కె.వెంకటసుబ్బయ్య, మాన్సాస్ చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోకగజపతిరాజు, కళాశాల పూర్వ విద్యార్థి ఎస్‌వీఎస్ సురేష్‌బాబులు అతిథులుగా వచ్చి ప్రసంగించారు. ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యా ప్రయాణాన్ని అందుకున్న లక్ష్యాలను వివరించారు. వీరు విద్యార్థులకు ఎక్స్‌లెన్స్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు, వైస్ ప్రిన్సిపాళ్లు, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు


ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఉపాలయంలో కొలువుదీరిన శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని అర్చకులు ఈ మహా ఘట్టానికి శ్రీకారం చుట్టారు. ముందుగా స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. ఐదు రోజుల పాటు జరగనున్న స్వామి వారి కల్యాణం సజావుగా సాగాలని సంకల్పిస్తూ మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణ నడుమ ధ్వజస్తంభంపైకి గరుత్మంతుడి చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కిషోర్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధికి కుట్టుశిక్షణ


శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక

గజపతినగరం: మహిళలు సొంతంగా జీవనోపాధి పొందేందుకు స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద ప్రభుత్వం టైలరింగ్‌లో శిక్షణ అందిస్తోందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బెల్లాన బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో కుట్టుశిక్షణ తీసుకున్న మహిళలతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మహిళల జీవనోపాధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. టైలరింగ్‌ను జీవనోపాధిగా ఎంచుకున్న వారికి జగనన్న చేదోడు పథకం కింద ఏటా రూ.10 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు, టైలరింగ్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ జె.లక్ష్మునాయుడు, పురిటిపెంట, తుమికాపల్లి సర్పంచ్‌లు కొంత్యాన విజయలక్ష్మి, బెల్లాన త్రినాథరావు, జిల్లా రీసోర్స్ పర్సన్ కృష్ణవేణి, ఏపీఎంలు ఇందిరాదేవి, సత్యవతి, యు.జగదీష్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల జరిగిన ప్రాంగణ ఎంపికల్లో సెలక్ట్ అయిన 15 మంది విద్యార్థులకు సోమవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. దీనిపై పరిశ్రమల యాజమాన్యాలతో ప్రభుత్వాధికారులు మాట్లాడుతున్నట్లు చెప్పారు. రూ.8 కోట్లతో చీపురుపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరడ రాందాసు, మంగళగిరి శ్రీను, కళాశాల ప్రిన్సిపాల్ డా.వి జయలక్ష్మి, విభాగాధిపతులు చంద్రమౌళి, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్మిక దినోత్సవం



విజయనగరం పూల్‌బాగ: ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు



విజయనగరం టౌన్ ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక నాయకులు

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను సోమవారం అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కార్మిక జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణకు అందరూ పాటు పడాలన్నారు. ఐక్య పోరాటాలతోనే కార్మిక హక్కులను సాధించుకోగలమని పలువురు వక్తలు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


విజయనగరం టౌన్: మేడే వేడుకల్లో మాట్లాడుతున్న ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు బెహరా శంకరరావు, తదితరులు


నెల్లిమర్ల: నగర పంచాయతీలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు


విజయనగరం పూల్‌బాగ్: అరుణపతాకాన్ని ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు


నెల్లిమర్ల: కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకుడు సన్నిబాబు